# కడుపుతీపి

'మంజుశ్రీ'

అత్తగారిల్లంటూ ఏమీ ఎరగదా బంగారుతల్లి. కాపురానికి రావటంరావటమే శ్రీకాకుళం వచ్చేసింది. నలుగురు పిల్లలూ ఇక్కడే పుట్టారు. దేవతల్లాగా ఉంటారు. దిగులూ, చింతా లేకుండా హాయిగా కాలం గడిచిపోతున్నది వాళ్లకు. చాలా రోజులనుంచి అక్కడే ఉంటున్నారేమో అదే స్వంత ఊరై పోయింది వాళ్లకు.

పనిపాటలన్నీ చక్కగా వచ్చిన ఇల్లాలామె. మొగుణ్ణీ, బిడ్డలనూ చూసుకొని ఆమె పొంగిపోతుంటుంది. ఆ ఇంటి వైభవం చూస్తే కళ్లపండుగ. ఒకడొచ్చి మీద కెగబడి పాలు తాగుతుంటాడు. మరొకడు వెనకగా వచ్చి కళ్లు మూస్తాడు తల్లికి. ఇంకోడు జుట్టు సవరిస్తాడు. కాసంతకూడా విసుక్కోదు. దూడలాగా పాలు జుబుకుతున్నా, మాటి మాటికీ గారంచేసి మీదపడుతున్నా కోపగించుకోదు. ఇప్పటికాలం లాగా ఆమె ఫాషన్లు ఎరుగదు. బిడ్డలకు పాలు కుడపని తల్లులేం తల్లులో? ఇట్లా కాలం గడుస్తూ ఉండగా, గుండెలు కరిగిపోయి, కళ్లు కాలవలయ్యే విచిత్రం ఒకటి జరిగింది.



[ స్వర్గీయ వేటూరి ప్రభాకర శాస్త్రిగారి పద్యకృతికి వచనా కృతి. ]

శ్రీకాకుళం తెలుసుకదా. తెలుగువాళ్ల ఉజ్జ్వలమైన చరిత్రను శ్రీకారం చుట్టిన చోటది. కృష్ణవేణమ్మ ఒడ్డు. ఉత్తుంగ తరంగాలతో విశాలంగా, గంభీరంగా ప్రవహిస్తూ ఉంటుంది కృష్ణ అక్కడ.

శ్రీకాకుళంలో ఒక ఓవర్సీరుగా ఉన్నారు. ఆయన తమిళుడు. అయినా, ఉద్యోగం నిమిత్తం అక్కడ చాలా రోజులనుంచి ఉంటున్నారు. చిన్నవాడే. ఆయనగారి భార్య అందాలరాశి. మగువలా కన్య. పసికందు ఉన్నారే చందమామ కూనలు. అంతకంతల్లై. తాళి, మతి, కూనా గుజ్జు తలంబ్రాలు, బొట్టు బొమ్మా, ఒక్కొమ్మా, కాళ్లకైనా అప్పట్నుగా పుట్టుకొచ్చారు నలుగురు. రత్న మాణిక్యాలూ, వజ్రాలూ, వైడూర్యాలూ,

అది శ్రావణమాసం. ఆ ఏడు వర్షాలు చెప్పలేనంతగా కురిశాయి. బెజవాడ ఆనకట్టపైన ఇరవై అడుగుల ఎత్తున పారుతున్నది కృష్ణ. గట్లు కనపడటమే లేదు. పొంగి పొంగి, పొర్లి పొర్లి పారుతున్నది. సముద్రాన్ని చేర బోతున్నది కాబట్టి, ఆ నడీ, వైశాల్యమూ కళ్ళు తిరిగేలా ఉంది కృష్ణ.


కొంపలెన్నో కూలిపోయినాయి. ఆవుల మందలు చెల్లా చెదరై ప్రాణభయంతో పరుగులు పెట్టాయి. గింజా గిట్రా, నగా నట్రా, డబ్బూ దస్కమూ నీటి పాలై పోయినయ్. బతికితే చాలును భగవంతుడా అన్న దుర్దశ పట్టింది పల్లెల్లోని మనుషులకు. మిన్నూ, మన్నూ ఏకం చేసేట్టుగా, ప్రళయ తాండవం చేస్తూ పరుగులు తీస్తున్నది కృష్ణ.

**సృష్టికి మూలం ప్రేమ. సృష్టంతా ప్రేమ నిండి ఉంది. సృష్టికర్త ప్రేమమూర్తి. ప్రేమ మూర్తం తెలుసుకున్నవాళ్లు కరుణ తేసి తెలుసుకోగలరు. లోకంకోసం ప్రాణా లర్పించటం త్యాగాలలో మహత్తర మైనది. తన వారికోసమే కాకుండా ఇతరులందరి కోసం ఆత్మత్యాగం చేసే ధైర్యం ఏ దేవతా స్వరూపు లకో తప్ప సాధ్యం కాదు**

పైన పులిమీద పుట్రలాగా ముసురు పట్టింది. చినుకు చినుకు వాన. ఈదురుగాలి. పుట్టలూ, గుట్టా—అన్నీ జలమయమే. వరద, వరద. ఎక్కడ చూసినా బురద. కాలు తీసి కాలువేయ లేకుండా అయింది శ్రీకాకుళం. గజిబిజి. బురదరొచ్చు. నిండుగా పొంగి పొర్లుతూ, కంటికానినంత మేరా జలమయమే అయిన ఆ దృశ్యాన్ని చూడాలనీ, అలాంటి గొప్ప ప్రవాహంలో స్నానం చేస్తే గొప్ప పుణ్యం మూట కట్టుకోవచ్చునని ఊరుగాళ్ళవాళ్ళా, పొరుగూళ్ల వాళ్లా గుంపులు గుంపులుగా చేరుతున్నారు శ్రీకాకుళం. పసుపుకుంకుమలూ, పూలూ పళ్లూ కృష్ణమ్మకి కానుక పెడుతున్నారు, పూజలు చేస్తున్నారు—కడుపులు, కళ్లూ చల్లగా ఉండాలని. తల్లివేళ్లతో సహా తుళ్లి పడిపోయి, సముద్రంతో కలియ డానికి తేలిపోతున్నాయి, అలలమీద కొన్ని పెద్ద పెద్ద చెట్లు. ఆ ప్రవాహంలో మళ్ల తిరుగుతూ, వచ్చి చెడి చేయగల విన్నపాలై గట్లు చేరుకొంటున్నాయి కొన్ని పశువులు. తరంగాలపైన తళతళ లాడే, తైతక్కలాడే, మిలమిలలాడే చేపలను ఒడిసిపట్టి ముక్కున కరుచు కుంటూ గుంపులు గుంపులుగా కొంగలు గోల చేస్తున్నాయి నదిపైన. లంకలన్నీ మునిగిపోతున్నాయి. ఇంకా ఎంత మేర వెడల్పవుతుందో చూద్దామని గుంపులు గుంపులుగా వచ్చి చూస్తున్నారు ప్రజలు.

ఎవరైనా మునిగిపోతుంటే, కొట్టుకొని పోతుంటే రక్షించే ఉద్దేశంతో అద్దరీ, ఇద్దరీ పడవలు కొన్ని తారట్లాడు తున్నాయి. నాలుగు మైళ్ల వెడల్పున కృష్ణానది సముద్రంలా సాగిపోతూంది. మహా భయంకరంగా ఉంది.

అప్పుడు తానుకూడా పుణ్యం కట్టుకోవాలని, ఆ మహా ప్రవాహంలో మునగాలని ఓవర్సీరుగారి భార్య బిడ్డ లతో కలిసి నది దగ్గర కొచ్చింది. ఆయనగారు నది దగ్గరే ఉన్నట్లుంది. పిల్లలను తీసుకొని ఆమె వచ్చింది. స్నానం చేసేందుకు అనువైన చోటు చూపి, ఆయన ఆ పక్కనే బిడ్డలను చూసుకుంటూ కూచున్నాడు. ఒక్కొక్క బాబుని జాగ్రత్తగా స్నానం చేయించి గట్టున భర్త దగ్గరికి చేరుస్తోం దామె. ఓ బుడుతని స్నానం చేయిస్తూ ఉంటే, దగ్గరగా తుమ్మచెట్టు కొమ్మ ఒకటి కొట్టుకొని రావటం చూసిం దా ఇల్లాలు. పాపడిమీది కొస్తుందేమో ఆ ముళ్ల కొమ్మ అని భయపడి, ఆ కొమ్మ దగ్గరగా రాగానే చేత పట్టుకొని అవతలకు విసరే సింది. ఆ కొమ్మమీద మిలమిలా మెరిసి నట్లు, మినమినా పాకినట్లు ఆమె కళ్ళు అల్లల్లాడి పోయినాయి. అదేమో! పామో! ఏమో! గుండె గుబులు గుబులుగా అయిపోయింది. "స్వామీ! సుబ్రహ్మణ్యా! మోపిదేవిలో వెలసిన తండ్రీ. నీకు మొక్కుకుంటున్నాను. నీ దర్శనానికి వస్తాను. పుట్టలో పాలు పోస్తాను. నా బిడ్డల్ని కాపాడు, తండ్రీ! నీవే నాకు దిక్కు" అని మొక్కుకుంది. బిడ్డల నందరినీ గట్టు చేర్చింది. తరవాత కొప్పు విదిల్చి, చిక్కుతీసి, కొంగు నడి వేసుకొని, పసుపు పూసుకొని, మంగళ సూత్రాన్ని కళ్లకద్దుకొని, గుమ్మడి మూటలా కూర్చొని, సమయానికి



మైసూరు రాజభవన ఆలయం ఫోటో—భరద్వాజ

సందర్భపడ్డ బ్రాహ్మడు మంత్రాలేవో చెపుతుండగా, ఆ బంగారుతల్లి, కరగ బోసిన బంగారం ముద్దేమో అనుకొనేలా మేనికాంతులతో కృష్ణవేణి కాంతు లీడు కోగా స్నానం చేసింది! మసక మసకగా కనపడే సూర్యుడికి అర్ఘ్యమిచ్చింది. హరహర అంటూ నీళ్లలో ఆమె మునగ గానే, గట్టునే ఉన్న బిడ్డలు గగ్గోలు పడ్డారు. మా అమ్మ మునిగి పోయింది. అయ్యో, అయ్యో అని తందర బింద రైనారు. అడ్డూ అదుపూ లేకుండా, అదీ అంతం కనరాకుండా, పొంగి పారలే ఆ ప్రవాహంలో క్షణకాలం మునిగి ఆమె కనపడలేదు, కాలవాహినిలో మునిగి నట్లే అనిపించేలా. ఆ తరవాత భానో, భాస్కరో రవిః అంటూ పలుకుతూ, బ్రాహ్మడికి దక్షిణ ఇచ్చి, దీవనలెన్నో తీసుకొని, బిడ్డల్ని వెంట పెట్టుకొని అక్కడినుంచి శ్రీకాకుళాంధ్రదేవుడి ఆలయానికి వెళ్లింది.

"నా తండ్రీ, శ్రీకాకుళ మహాప్రభూ! కాపురానికి వచ్చినప్పటినుంచీ చీకూ చింతా లేకుండా సుఖంగా ఉన్నా మిక్కడే మేము. నీ దయ ఇదంతా. ఇంకో చోటికి బదిలీ, గిదిలీ రాకుండా చెయ్యవయ్యా. ఈ విధంగానే ఎప్పుడూ మమ్మల్ని కరుణించి కాపాడు, తండ్రీ" అని ప్రార్థన చేసి, తీర్థమూ ప్రసాదమూ తీసుకొని, బిడ్డలు కాళ్లకడ్డం పడుతూ ఉండగా ఇల్లు చేరుకొంది. ఆయనగారు కూడా అప్పటికి ఇంటికి వచ్చేశాడు. ఆ రోజు శ్రావణ మంగళవారం కాబట్టి, నోము నోచుకొనే ముద్దరాళ్లు ఎందరో వచ్చి పేరంటం పిలిచిపోయినారా ఇల్లాలిని. అసలే ఓ ముత్తైదువనీ, బ్రాహ్మణ్ణి పిలిచి భోజనం పెట్టి, ఈ పేరటితో నాకు పాపక్షయమై పోయిందంటూ మురుసు కొం దా వెర్రిబాగులతల్లి.

సుష్టుగా భోజనంచేసి పడక్కుర్చీలో కూర్చుని ఆఫీసు కాగితాలు చూసుకొంటు న్నాడు ఇంటాయన. తమలపాకు ఈనెలు తీస్తూ, చిలకలు చుడుతూ, పిల్లాణ్ణి ఒళ్లో వేసుకొని, తాంబూలం ఆయన కందిస్తూ కూచుంది దగ్గరే ఇల్లాలు. పొద్దుటి నదీస్నానమూ, పసివాడి కొంటె తనమూ, ఎడవాడి చురుకుతనమూ, పెద్ద వాడి తెలివీ, చిన్నవాడి గారాం చెప్పు కుంటూ, మాటమీద మాట చేరుస్తు న్నారు దంపతులు. అంతా సంతోషపు ముచ్చట్లలో మునిగిపోయినారు.

ఇంతలోనే టపాబంట్రోతు వచ్చాడు. వాగులూ, వంకలూ వరద పారుతున్నది. ఎప్పటి డి. ఓ. లప్పుడు రావటమే లేదు కదా అని ఆత్రంగా ఆఫీసు కాగితాలు చూసుకున్నా డాయన. అందులో ఒక ఉత్తరం తత్తరపాటు కలిగించేదిగా ఉంది. ఆయనగారి పనిని మెచ్చుకుంటూ, శక్తి సామర్థ్యాలను పొగుడుతూ, జీతాన్ని కొంచెం పెంచడంతోపాటు, మద్రాసుకు బదిలీ చేస్తూ పై అధికారులు పంపిన తాఖీదు అది. జీతం పెరగడమూ, పై అధికారులు మెచ్చుకోవడమూ క్షణకాలం మనస్సుని సంతోషపెట్టాయి గాని, నిమ్మకు నీరెత్తినట్లుగా, హాయిగా ఆ ఊళ్లో గడిచిపోతుంటే ఇప్పు డీ బదిలీ ఏమిటా అని ఆయనగారికి చాలా దిగు లైంది. దిక్కుతోచక, ఆ వార్త కాస్తా ఇల్లాలికి చదివి వినిపించాడు. ఇప్పుడు మన కీ బదిలీ అని విచారంగా చెప్పాడు. ఆమె ముఖం వెలవెలబోయింది.

(తరువాయి 38 వ పేజీలో)

# కడుపు తీపి

( 35 వ పేజీ తరువాయి )

తలుచుకోగానే దుఃఖం వచ్చింది నాకు నిండా.

"ఇదేమిటండీ ఇలా అయింది? జీతం ఎక్కువైతేమాత్రం మద్రాసులో మనకు మిగిలేదేముంది? మన్నుకు మన్ను. హళ్లికి హళ్లి. సాయిబు సంపాదన బూబు కుట్టుపోగులకు సరి అన్నట్లు... పెరిగిన నాలుగు రూపాయలూ అక్కడ ఖర్చుకే చాలవు. ఇహమో పరమో నా కిక్కడే బాగుంది. మీ కాళ్లు పట్టుకుంటాను, ఎట్లానో తంటాలు పడి దీన్ని తప్పించుకోండి. నే నిక్కణ్ణుంచి ఎక్కడికీ రాను. మద్రాసట మద్రాసు. సంకటపు కొంపలు. కల్తీ సరుకులు. చాలీచాలని జీతాలు. నాకొద్దు ఈ బదిలీ" అని గట్టిగా చెప్పింది.

"శిక్షగా కాదుగా ఈ బదిలీ ఇచ్చింది మన కేదో మేలు చేద్దామని. మెప్పుగా ఇస్తే పోనని అనకూడదు. వద్దన్నా వినరు. ఇది మనకు తప్పదు. నీ వంటింటి కబుర్లన్నీ నాకు చెప్పనాకు. నాకుమాత్రం ఇష్టమనుకున్నావా? పొంగి పొర్లగిల పడుతున్నా ననుకున్నావా? గవర్నమెంటు కొలువంటే నీ కంత చులకనైందా?" అని కస్సు బుస్సుమని జావగారిపోయినాడు ఇంటాయన. "నీ కన్నా నా కెక్కువ చిరాకుగానే ఉంది. అయితే ఏం చేస్తాం? జీతమెక్కువే కాని, పై రాబడి సున్న. 'దంపినమ్మకు బొక్కిందే కూలి' అన్నట్లుగా జీతం రాళ్లతోనే బతకాలి. హాయిగా నదీస్నానం చేసేందుకు వీలు లేదు కదా! కూవమ తలుచుకోగానే కడుపు తిప్పుతుంది. కమ్మని కూరలు తలుచుకోగానే తిరువళ్లిక్కేణి గుర్తొచ్చి భయమేస్తున్నది. చల్లనిగాలి అంటే, చాలీ చాలని తలుపులు గడియ పెట్టుకోవాలి, మురుగుదొడ్ల వాసనలు తలుచుకొంటూ. ఆరోగ్యమా అంటే డాక్టర్ల కోసం తిరగలేక చావాలి. బోడిగొప్పలకు పోయి, ఎగరలేని ఎత్తులకు ఎగిరి కాళ్లు విరగ్గొట్టుకొనే సామాన్య సంసారులకు మద్రాసు కాపురమా? ఇక అయినట్లే—" అని చాలా బాధపడ్డాడాయన.

"శ్రీకాకుళస్వామి తిరునాళ్లు మళ్లీ మనం చూస్తామో లేమో! ఉభయ సోమేశ్వర క్షేత్రాన్ని మళ్లీ చూడగలుగుతామో లేదో! నా కిక్కడ చాలా సౌఖ్యాన్ని కలిగించి, కళ్లకు కప్పుకున్న తెలుగువాళ్ల స్నేహం మళ్లీ నాకు దొరుకుతుందో లేదో. మళ్లీ అసలు తెలుగునాడులోకి వస్తానో! రానో! అయినా, ఈ కృష్ణానది తీరానికి మళ్లీ నా ఉద్యోగాన్ని మారుస్తారని ఎట్లా అనుకుంటాను! ఎప్పు డేం జరుగాలో అప్పు డది జరిగి తీరుతుంది. మనం చేయగలిగిందేమీ లేదు. ఇక ఇప్పుడు దక్షిణయాత్ర మాత్రం తప్పించుకోలేం," అని ఉస్సురని నిట్టూర్చాడు.

ఆయనగారి మాటలు వినేసరికి ఆమె కెక్కడలేని దిగులు పుట్టుకొని వచ్చింది.

'మళ్లీ ఎప్పుడు చూస్తానో కృష్ణమ్మ తల్లిని! తేనెలూరే తియ్యటి తెలుగు మాటలను మళ్లీ ఎప్పుడు వింటానో. ఇంకొక్క మాటైనా వింటానో లేదో— ఇంకొక్కసారి నేను మళ్లీ శ్రావణ శుక్రవారం నోము ఎప్పుడు నోచుకుంటానో ఇక్కడ. ఈ లంక వంకాయకూర జిహ్వ రుచి తీరేలా మళ్లీ ఎప్పటికో నేను తినగలిగేది. మళ్లీ ఈ ఇంటికి నే నెప్పటికైనా రాగలుగుతానా? ఈ ఊళ్లో కాపురం ఇక నాకు ఇంతటితో సరేమో! శ్రీకాకుళం విడిచిపోవాలంటే నా మనస్సంతా ఆకులమై పోతున్నది. ఎండ పొడకూడా జారిపడకుండా, పందిరినిండా గుత్తంగా అల్లుకున్న కాకరతీగకు, ఆకాకు సందునా పిందెలు తొంగి చూస్తున్నాయి. ఈ కాకరపాదును విడిచిపెట్టి నే నెట్లా పోతాను, అడుగు ముందుకు పడుతుందా? లాభం లేదు. పయరకూర వేయించి, మిరపపండ్లు పోసి, ఊరవిచ్చి, తిరగమాత చేసి, గోంగూరపచ్చడి తినే అదృష్టం ఇక ఇంతటితో ఆఖరు కాబోలు' అని ఆమె కళ్లనీళ్ల పర్యంతమైంది.



తూర్పార... ఫోటో — కె. ఎస్. వాసుదేవమూర్తి

ఇంటాయనకూడా ఊరుకోలేక పోతున్నాడు. గడిచిపోయిన కమ్మని రోజులను తలుచుకొని కిందా మీదై పోతున్నాడు.

'తెల్లనిపూలతో పరిచినట్లుండే కొత్తిమిర మళ్లు మళ్లీ చూడటం జరిగేనా? తరగని పాడిపంటలతో, మిత్రు లిండ్లలో నెయ్యి పెరుగులతో విందు లారగించాను. కళ్ల పండుగ్గా తోక లెత్తి రంకె లేస్తూ గంతులేసే కోడెదూడలను చూడగలిగాను. సెనక్కాయలు, మొక్కజొన్న కండెలు, ఊచకంకులు వాటి రుచి మరేవరి. చిరుతిండ్లు తిన్నాను కొన్నా కవటం లేని, హృదయం ఇచ్చి ఆదరించే మిత్రులమధ్య మన గలిగాను. కృష్ణమ్మా! ఇదంతా నీ చలవ. నీకు చేతులెత్తి మొక్కుతున్నాను. పాలు పెరుగుల తీపి ముందు చక్కెర బలాదూర్. గడ్డ పెరుగు, జిడ్డోదలని నెయ్యి, కూరగాయల రుచి చెప్పనలవి కాదు, కృష్ణ ఒడ్డు ఊళ్లలో. ఏం మనుషులయ్యా వీళ్లు! మాయా మర్మాలు లేనివాళ్లు. పెద్ద పెద్ద చదువులు చదవకపోయినా, మంచికీ మర్యాదకూ ప్రాణమిచ్చే మనుషు లిక్కడి వాళ్లు. పైకి మాత్రం టెక్కు చూపిస్తారు కాని, గర్వం లేదు వీళ్లకు. మంచి వాళ్లు తెలుగువాళ్లు. అతిథుల్ని చాలా గౌరవిస్తారు. అణగి మణగి చచ్చినా ఉండరు. ఇంతదానికే పొంగిపోతారు. చాలా నీతినియమాలు కలవాళ్లు. ఎంతో ఉన్నతులు. అందుకే తెలుగువాళ్లంటే నాకు చాలా ఇష్టం. అణకువగాను, మన్ననగాను మాట్లాడతా రిక్కడ ఆడవాళ్లు. బెత్తాల్లాగా, నిటారుగా, అందంగా ఉంటారు. చక్కని కళ్లు వీళ్లవి. అంత లావుగానూ ఉండరు, అంత సన్నంగానూ ఉండరు. మన దేశం మొత్తంమీదా కూడా ప్రత్యేకమైన అందచందా లున్నాయి ఇక్కడి ఆడకూతుళ్లకు' అని భార్యాభర్త లిద్దరూ తెలుగుదేశంపైన, తెలుగువాళ్లపైన, తెలుగుపైన తమకున్న అభిమానాన్ని పోటా పోటీలు పడి వెల్లడి చేసుకొన్నారు. అలా ఎంత సేపని బాధ పడతారు! ఇంటిపని ఆమెకూ తప్పదు. బయటపని ఆయనకూ తప్పదు. మళ్లీ ఎవరి పనుల్లో వాళ్లు మునిగిపోక తప్పదు. కొత్త నీళ్లలో మునిగాం కదా, ఒంటికీ తలకూ ఒండు పట్టి ఉండ వచ్చునని బిడ్డలకు తలంటి పోసింది. తాను పోసుకుంది. సాయంత్రమై పోయింది. చీకటి పడబోతున్నది. చాలా ఇండ్లకు వెళ్లాలి. శ్రావణ మంగళవారపు సెనగలు తీసుకోవాలనుకొంటూ ఆమె పేరంటానికి కదిలింది. విరియపూసిన గుబురుగన్నేరు చెట్లలాగా, గుంపుగా పేరంటాళ్లు పడి చారు వీథుల్లో. నిండు పయటలు. కొప్పులనిండా పూలు. పెద్ద పెద్ద కళ్లు. తెలుగువాళ్ల సౌభాగ్యమంతా కుప్ప పోసినట్లుగా ఉన్నారు వాళ్లు. ఉన్న నగలన్నీ పెట్టుకొని, బిడ్డలందరినీ వెంట పెట్టుకొని ఓవర్సీరుగారి భార్య నాలుగు వీథుల్లోనూ పిలిచిన వాళ్లందరి ఇళ్లకూ పేరంటానికి వెళ్లింది ఆ రోజు. ఉత్సాహం కొంతా, ఊరు విడిచి పోవాల్సి వచ్చిందన్న బెంగ కొంతా ఆమె మనస్సును నిండి సందడి చేశాయి. ప్రతి ఇంట్లోనూ చెప్పింది తమ కిక్కడినుంచి బదిలీ అయిందంటూ. వాళ్లంతా చాలాచాలా నొచ్చుకున్నారు. వాళ్లిచ్చిన పసుపు కుంకుమలు, తాంబూలాలు, సెనగలు ప్రేమతో తీసుకుంది. కళ్లనిండా నీరు నింపుకొంది. మళ్లీ మిమ్మల్ని చూస్తానో లేదో, నన్ను మరిచిపోవద్దండీ అని అందరినీ బతిమాలుకుంది. నా బొంది పోతున్నా, ప్రాణం ఈ ఊరు విడిచిపోదు అని చెప్పింది అందరికీ. ఆమె ఇల్లు చేరుకోగానే మళ్లీ అందరూ తమ ఇంటికి వచ్చారు. అప్పటికి పొద్దు గూకింది. ఒక్కొక్కరే సెలవు తీసుకొని ఇళ్లకు వెళ్లిపోయారు.

ముసురు. ఈదురుగాలి. ఎండపొడ వచ్చిన కొంచెంసేపైనా, కాస్త హాయి నిచ్చిన సూర్యుడు కాస్త పడమటి కొండమీద గుమ్మడిపువ్వులా కాసేపు కనిపించి ఆటుతరవాత ఆ కాస్త మాయమైపోయినాడు.

జగత్తుకంతా చైతన్యాన్నిచ్చి, వెలుగుతో రక్షించిన కర్మసాక్షి కాస్తా కాంతివిహీనుడై వాల్చి పోయినాడు. ఇక ఏం జరిగినా ఎవరు చూడగలరు?

కాలం అనే మాయావి సూర్యుణ్ణి మాయంచేశాడు. చంద్రుణ్ణి, నక్షత్రాల గుంపులను మబ్బు తెరలచాటున బంధించాడు. ఇంకా ఏమేమి కాని పనులు చేస్తాడో ఎవరు చెప్పగలరు?

మెల్లమెల్లగా ఇళ్లు శోధించటానికి పిల్లులు బయలుదేరాయి. చెట్లకొమ్మల మీద చేరుకుంటున్నాయి గుడ్లగూబలు. పురుగూ పుట్రలు పాదలు, పుట్టలు విడిచి స్వేచ్ఛా సంచారానికి బయలుదేరాయి. అడవుల్లో పెద్దపులులు బొబ్బ పెడుతున్నాయి. జారులు, చోరులు తప్పు దార్లు గాలిస్తున్నారు. లోకాన్నంతా ఏదో ఒక మాయ ఆవరించింది. జాగ్రత్త అనేది చల్లగా జారుకోంటున్నది. వివేకమనేది మోహానికి లొంగిపోయింది. కామదేవత ఆవేశించి పరవారులు మరులు కొంటారు. ఈశ్వరుడు ఈ కటిక చీకటిని ఎందుకు సృష్టి చేశాడో మరి? తెలియరాదు కదా.

ఆ సమయంలో ఓ వర్ధిరుగారి ఇల్లాలు త్వరత్వరగా వంట ముగించింది. బిడ్డ గాళ్లకు, ఆయన గారికి అన్నాలు పెట్టేసింది. అద్దెఇంటివాళ్ల పెద్ద మంచాన్ని గూర్చి ఇన్నాళ్లు తలుచుకోనే లేదు. అది కదిలించేది కాదు. చాలా పెద్దది. అందుకనే ఇంటివాళ్లు అక్కడే ఉంచారు. పరుపు దులిపి ఆ మంచంమీద చక్కగా పక్క వేసిం దామె.

పిల్లలను దగ్గరగా తీసుకుని పడుకోండి, అసలే ఈదురుగాలి. చలి. భయపడతారు. కీచురాళ్ల రొదలు. కటిక చీకటి అని భర్తను బ్రతిమాలుకుంటున్నట్టుగా చెప్పింది. కన్నవాళ్లలారా, నా బంగారుకొండల్లారా, ముద్దుల మూటల్లారా, నాన్న దగ్గరే బజ్జోవాలి ఈవేళ అని బుజ్జగించి చెప్పినా, పిల్లలు ఎంతకూ వినలేదు. మారాం చేశారు.

నాన్న దగ్గర పడుకుంటే నిద్ర రాదమ్మా మాకు. నీ పక్కనే మాక్కూడా పక్క వేయాల్సిందే. నీవు అన్నం తిను. అప్పటిదాకా నాన్న దగ్గరే కూచుంటాము. అంతేకాని ఇక్కడ మాత్రం పడుకోమని, ఏకగ్రీవంగా పంతం పట్టారు. ఈ మాటలు వినేసరికి అమ్మకు నవ్వొచ్చింది.

"అమ్మ, అమ్మ, అమ్మ అని అమ్మకోసమే అంగలారుస్తారెప్పుడూ, ఏమై పోతార్రా ఒకవేళ అమ్మ లేకపోతే. . ." అని కసురుకుంది. ఈ మాటలు వినేసరికి ఆయన గుండెకుదురు తప్పింది. ఉలికి పడి సర్దుకున్నాడు.

అమ్మ అన్నం తింటున్నంతసేపూ మళ్లీ ఎదురుగానే చేరి కూచున్నారు పిల్లలు. నిద్ర ముంచుకొని వస్తున్నా ఆవలిస్తూ, తూలుతూ ఎదురుగా కునికిపాట్లతోనే కూచున్నారు గాని, తండ్రి దగ్గర పోయి పడుకోలేదు. ఇది చూసి తొందర తొందరగా తినేసి, ఇల్లు బాగు చేసుకుంది. కురేపాట్ల బిడ్డల్ని పావడిలో నేలమీద కంబళి పరిచి, మీ అగడమే సాగించుకున్నారు గదర్రా అంటూ తన పక్కనే పడుకో బెట్టుకుంది.

పిల్లలు నిద్ర పోయినారు. పక్క మంచంమీద ఆయనకూ హాయిగా కునుకు పట్టింది. ఆమెకే నిద్ర రాలేదు. ఎంత చెప్పినా వినకపోయిరి. పక్కమంచంమీద



వెలుగునీడలు ఫోటో—ఎమ్. జి. కె. రెడ్డి

హాయిగా పడుకోండర్రా అంటే వినక కళ్లు మూతలు పడుతున్నా, ఆవలిస్తూ నా ఎదురుగానే కూచున్నారు గాని లేవలేదు గదా కన్నవాళ్లలారా— అని వాళ్లందరి మీద చేయేసి, అమ్మమీద ఎంత ప్రేమో, ఆపేక్షో అని మురుసుకొంది. వెన్నుమీద చేయేసి ఒకడు, గుక్కలు గుక్కలు పాలు గుట కేస్తూ ఒకడు, చెరుగు తనమీదికి లాక్కుని ఒకడు, అమ్మ చెంపకు తన చెయ్యి ఆన్చి ఒకడు—అమ్మ మనసంతా నిండి హాయిగా పడుకొన్నారు.

'స్వామీ, మంచీ, చెడ్డా తెలీని పసికూనలు. భయంకూడా తెలీనివాళ్లు. నన్నొదిలి ఉండలేక నా పక్కనే పడుకున్నారు. అర్ధరాత్రి, అపరాత్రి, ఒళ్లెరగని నిద్రలో ఏ ఆపదా రాకుండా చూడు. నీదే భారం, తండ్రీ, శ్రీకాకుళస్వామీ' అని ప్రార్థనలు చేసి, తానున్నూ నిద్రలోకి జారిపోయిం దామె.

కీచురాళ్ల అరుపులు ఈలలు వేస్తున్నట్లుగా చెలరేగాయి. కంచు గీసినట్లుగా గోల చేశాయి. కప్పల బెకబెకలు ఎక్కువైనాయి. ప్రవాహ పోటుహోరు అన్నిటినీ తనలో భయంకరంగా లీనం చేసుకొంటున్నది. పెద్ద సైన్యం యుద్ధానికి వెళ్లి గెలిచి, అట్టహాసంగా అర్చినట్టుగా ఉంది పది హోరు. ఈదురుగాలి, ముసురు వాన, చీకటి, కరువు, అక్కర, దరిద్రం ఒకేసారి సంభవించినట్లుగా కూడుకొని వచ్చాయి. ఎవరిళ్లలో వాళ్లు. గుండె లరచేతుల్లో పెట్టుకొని, ముడుచుకొని పడుకుని నిద్రలు పోతున్నారు. అలాంటి సమయంలో రాత్రి కొంత గడిచిపోయింది. లాంతరు వెలుగుతూనే ఉంది. పసివాడు లేచి పాల కేడ్చాడు. ఆమెకు కొట్టినట్లు మెలుకువ వచ్చింది. తలుపు తెరిచి దీపం వెలుతురు దారి చూపుతూ ఉంటే, పెరట్లోకి వెళ్లి వచ్చింది. అయ్యో, పిల్లా డేడ్చాడు. గొంతు ఎండిందో ఏమో అని అంగల పంగలమీదనే వచ్చింది ఆమె పాపం. గోళ్లెం తగిల్చి, ఒక్క అంగలో పాపడిని ఒళ్లో వేసుకుని, పిల్లాడి నోటిని గుండెల కదుముకోబోతున్నది కూచుని.

తెల్లటి తాచు. ఉద్రేకంతో ఊగిపోతూ బుసలు కొడుతూ ఆమె మీదికి పడగ విప్పుకొని వచ్చింది ఎక్కడనుంచి వచ్చిందో! పిల్లల ధ్యాస, మరో చింత లేని ఆ కన్నతల్లి రెండు చేతులతోను ఆ పాముపడగ నలాగే గట్టిగా పట్టేసుకుంది. పిల్లలో, పిల్లలో, అమ్మో, నా పిల్లలో అని గగ్గోలుగా గోలుగోలున గుండెలు పగిలేట్లుగా అరిచింది. కేకలు పెట్టింది. నిద్దర్లో మునిగి ఉన్న భర్తా, పక్కనే పడుకుని ఉన్న పిల్లలు, ఇరుగిళ్లవాళ్లు, పొరుగిళ్లవాళ్లు దద్దరిల్లిపోయినారు. ఆమె ఏడుపుకేకలకు.

'ఏమిటే అదేమిటే' అని గుండెలు బద్దలై, కళ్లు మసకలు కమ్మి లేచి నిలబడ్డా డాయన. పిల్లలు గోలు గోలున ఏడుపుల్లో మునిగిపోయినారు.

'అయ్యో,పిల్లలండీ!పిల్లల్నెత్తుకోండి. బిడ్డలని తీయండి' అని ఏడుస్తుండే కాని, నా చేతుల్లో పామును పట్టుకున్నాను. నన్నది కరుస్తున్నదర్రా నాయనో అని ఏడవదు. ఒక్కసారి అమాంతంగా గుండె పగిలిపోయినట్లు, బిడ్డల్ని మంచంమీదికి చేర్చండీ అని ఏడుస్తున్న భార్య కేకలకు బెదిరిపోయి, ఏం మూడిందే అని ఉక్కిరి బిక్కిరై, కళ్లముందేమీ కనిపించక, ఏం జరుగుతున్నదీ తెలుసుకోలేక, ఏదో మంత్రానికట్టు పడ్డట్టు బిడ్డల్నందరినీ మంచంమీదికి చేర్చాడు.

చీకటినంతా మింగుతున్న హోరున్న ప్రవాహపు మోతనుకూడా మింగుతూ, ఈదురుగాలిని చీలుస్తూ, నిద్రలు పోతున్న ఊరివాళ్లను లేపగొట్టే, ఇదేమి ఉపద్రవంరా, భగవంతుడా అని గజగజ వణికిపోయేట్లు చేసి, ఆమె కేకలు, వాళ్లింటికి తీసుకొని వచ్చాయి పక్క వీథులవాళ్లను.

అప్పటికి ఆ ఇంట్లో దృశ్యం ఇది:

తోకతో ఆమె రెండు చేతులను బలంగా చుట్టేసి, తలతో ఆమె చేతుల్లో కొట్టుమిట్టాడుతున్నది భయంకరమైన, క్రూరమైన ఆ పాము. ఆమె దాన్ని గట్టిగా పడగ కింద నొక్కి పట్టుకుంది. రెండు చేతులనుంచీ రక్తం ధారగా కారిపోతున్న దామెకు.

వాళ్లూ వీళ్లూ వచ్చి చూశారు. అప్పటికి అందరికీ అర్థమైంది. అందరికీ మతులు పోయాయి. ఎవరికీ ఏం చెయ్యాల్సిందీ తోచలేదు. చేతులనిండా బలంగా కట్లు కట్లుగా చుట్టుకొని ఉండె. బుసలు కొడుతూ తల ఊపుతూ ఉంది. అప్పు డొకాయన కో ఉపాయం తోచింది. ధైర్యం తెచ్చుకొన్నాడు. ఉత్తరీయాన్ని దాని నెత్తిన కప్పి, పడగ నేలమీద వాలగానే చంపేశాడు దాన్ని. చాలా బాధ



నంది (వెయ్యి స్తంభాల మంటపం హనుమకొండ)

ఫోటో—పి. నాగేశ్వరరావు (ఈమని)

పడి ప్రయత్నంతో ఆమె చేతులను ఆ కట్లనుంచి విడిపించాడు.

బిడ్డల నెక్కడ కరుస్తుందో అన్న భయంతో, ముందే దానిమీది కురికింది ఆ తల్లి. ఆమె కింకేమీ పాలు పోలేదు. ఆలోచన తోచలేదు. తనను తాను ఒడ్డుకొని పామును పట్టేసుకుంది. అంతేకాని ఇంకేమీ ఆమె మనసులోకి రానేలేదు. బిడ్డల ప్రాణాలు దక్కాయి. అప్పుడు చూసుకుంది తానేం చేసిందో? అప్పటికి తెలివొచ్చింది. అప్పటికి తెలివొచ్చింది. అయ్యో, భగవంతుడా! ఎంత పని జరిగింది! అది అప్పుడు విలవిలలాడిపోయింది. గుడ్లు తేలేసింది. మొక్కులు మొక్కింది. పాల కేడ్చిన పసివాడు మీదిమీదికి దూకుతా నంటూ ఏడుస్తున్నాడు. తక్కిన పిల్లలు గగ్గోలుగా ఏడుస్తున్నారు. వారూ వారూ అటూ ఇటూ పరుగులు తీసి ఏవేవో మందులు మూరుకొని తెచ్చారు. విషం నరనరాల పాకి, ఒళ్లంతా కాల్చేస్తున్నది. వెర్రిచూపులతో, పగిలిన గుండెతో పిల్లలని, భర్తని చూసి ఇట్లా అంది ఆ తల్లి. "అయ్యో! బిడ్డ గుక్క పట్టి పోతున్నాడు. ఆకలికి క్షణం తాళలేడు వాడు. ప్రాణం మున్నంతట్టి పోతున్నదే నా బిడ్డకు! పాలిద్దామా అంటే, నా ఒంట్లోకి విషమెక్కి పోయిందే. లేని ఏడ్పు ఇంతలోనే నిద్ర పోయాడే. ముందింత దయ్యం నెత్తి కొచ్చి కూచుం టుందని తెలియ కన్నా నాయనకు. నా నిద్ర నాకవంగాను. దయ్యపు నిద్ర ముంచుకొచ్చింది. అదే నా కొంప ముంచింది. ఏమండీ! పసివాళ్లను జాగ్రత్తగా చూసుకుంటానని చెప్పండి. ఏం లోపం చేయనని చెప్పండి. ఉపేక్ష చేయనని చెప్పండి. నాకు మాట ఇవ్వండి. అట్లా చెపితే నేను దిగులు లేకుండా చచ్చిపోతాను. చెప్పరా చెప్పరా!" అని ఏడుస్తూ బతిమాలుకొంది భర్తను. చూడ చుట్టము, మొక్క దైవము లేని గతి పట్టింది నాకు. పసికూనలు నా పిల్లలు. దిక్కూ దారీ లేనివాళ్లు. ఆకలైతే కడుపునిండా అన్న మెవరు పెడతారో— ఇక ఎవరు ఎత్తుకుని ఏడుపు మాన్పు తారు? మిమ్మల్నెవరు చూస్తారండీ! మీ రేమైపోతారండీ? మిమ్మల్నెవరు కనుక్కుంటారిక అని కిందా మీదై పోయింది.

పిల్లల్ని, భర్తనూ మార్చి మార్చి చూసుకొంది. వాళ్లవైపే చేతులు చాచింది. పిల్లలండీ పిల్లలు, పసివాళ్లండీ పసివాళ్లు. పసిబిడ్డలు—అంటూనే ప్రాణాలు వదిలేసింది.

* * *

ఆనాటి పొద్దున కృష్ణకు స్నానానికి పోయినప్పుడు నీళ్లలో కొట్టుకొని వస్తున్న తుమ్మకొమ్మ పిల్లవాడి కెక్కడ వస్తుందోనని చేత పట్టుకొని విరిచింది కదా. అప్పు డామె కళ్లముందు మెరిసి నట్టూ, మినమినలాడినట్టూ ఏదో కనిపించడమూ, అనిపించడమూ జరిగి నాయికదా. ఆలోచిస్తే అది పామే అని తెలిసిపోతున్నది. నిజానికి నీళ్లలో పడి కొట్టుకొనిపోతున్న పాముకు, ఆ కొమ్మ ప్రాణాధారమైంది. ఆమె చేయి దాన్ని రక్షించింది పొద్దుట. రాత్రి ఆ చేయితే, తన ప్రాణాన్ని రక్షించిన చేయి అన్నైనా లేకుండా ఆ దుమ్ము కరిచింది.

ఊళ్లో వాళ్లంతా కంట తడి పెట్టు కొని ఒకే ఇదిగా ఆమె గూర్చి చెప్పు కున్నారు. కన్నబిడ్డల కోసం వెనకా ముందూ చూడకుండా, ఇంకూ గొంకూ లేకుండా, తన ప్రాణాలు గడ్డిపోచ కన్నా తేలికగా ఎంచి ఇచ్చేసింది. అన్నిటి కన్నా ప్రాణం తీసి అన్న మాట ఈమె వల్ల అబద్ధమైపోయింది. మహాలక్ష్మి లాగా కాపురం చేసింది. కడుపునిండా బిడ్డల్ని కంది. మగణ్ణి కనుసన్నల్లో ఉంచు కొని సుఖపెట్టింది. పనివాళ్లను ఎంతో ఆదరించింది. వచ్చేవాళ్లను, పోయేవాళ్లను సంతోషపెట్టింది. చివరకు తన కన్న కడుపుకోసం సర్వస్వం ఇచ్చేసింది. ప్రాణాల్ని గాలిపోసింది. ఆనాడే కృష్ణలో బిడ్డలతో సహా స్నానం చేసింది. గుడికి వెళ్లి దేవుణ్ణి కొలిచింది. పూచిన తంగేడులా నగలన్నీ పెట్టుకొని ఇంటింటికీ పేరంటానికిపోయింది. పసుపుకుంకుమలు ఇంటింటా తెచ్చుకుంది. అందరికీ వీడ్కోలు చెప్పింది. తన కన్నబిడ్డల కోసం ప్రాణాలే బలి ఇచ్చిన ప్రేమమూర్తి ఎవరుంటారు? ఊరూ వాడూ ఆమె గూర్చి ఒకటే గొప్పగా చెప్పుకున్నారు. అప్పటినుంచీ తేళ్లుగాని, పాములుగాని, ఇంకా ఏ విషజంతువులుగాని ఆ ఊళ్లో వాళ్లను బాధపెట్టవట. ఒకే వేళ దారి తప్పి ఏదైనా బాధ వస్తే, ఆమె పేరు తలుచుకొంటే ఉపశమనం కలుగుతుందట.

దేవతల కొలువుల్లో ఆమెకూడా ఒక గ్రామదేవతై, వాళ్ల పూజలందుకుంటుం దట. 'ఆత్మార్థం పృథివీం త్యజేత్' అనే మాట ఏం మాట? ! లోకం కోసం తన ప్రాణా లర్పించడమే మహత్తర త్యాగం. వాళ్లకే అన్ని పుణ్యలోకాలు. ఆత్మత్యాగం చేసి, ఊరివాళ్లకు విషపురుగుల బాధ తప్పించింది. ఆత్మత్యాగంతో లోకసేవకూడా చేసేవాళ్లకే అక్షయ పుణ్యలోకాలు. తన బతుకోసం ఇతరులను హింసించే, చంపే దుర్మార్గుల నేమనాలి? సృష్టికి మూలం ప్రేమ. సృష్టి అంతా ప్రేమ నిండి ఉంది. సృష్టికర్త ప్రేమమూర్తి. ప్రేమ రూపు తెలుసుకున్నవాళ్లు కడుపు తీపి తెలుసుకోగలుగుతారు.

[ ఇది జరిగిన కథ అనీ, ఇందులో పతాక సన్నివేశం స్వర్గీయ శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు తమకు చెప్పారనీ, మమ్మ నీరయిపోయి తా మీ కథ నాశ మని చెప్పుకొంటూ సద్యాల్లో ఈ కథను 1925 లో శ్రీ ప్రభాకరశాస్త్రిగారు ప్రవచించారు. అంటే, సుమారు అర్ధ శతాబ్దం క్రింద ప్రాచారప్తు మాట. అంతకుముం దెప్పుడో శ్రీకాకుళంలో ఈ కథ జరిగి ఉంటుంది. ]